క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఈ నెల 2 నుంచి 5 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. 2న అంకురార్పణ, స్వామికి అభిషేకం, గోపూజ, 3న శ్రీ అలివేలుమంగా సమేత చెన్నకేశవస్వామి కల్యాణం, 4న ఉదయం రథోత్సవం, సాయంత్రం బండి తిరుగుట, బోనాలు, 5న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, చక్రతీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఆమనగల్లు: కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇంజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, స్వస్తివాచనం, అంకురార్పణం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులైన ఆరుట్ల గ్రామ వాసులు మానుపాటి గణేశ్‌కు రూ.60 వేలు, చీమల శివకు రూ.14 వేలను శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేష్, నాయకులు యాదయ్య, బాష, మార సురేష్, రాజు గౌడ్, రమణారెడ్డి, ప్రవీణ్ గౌడ్, కృష్ణ, కుమార్, బుగ్గ రాములు, బాలరాజు, శ్రీకాంత్, యాదయ్య, రఫీక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పాయిగూడకు బస్సు పునరుద్ధరణ

మంచాల: నాలుగేళ్ల తరువాత గ్రామానికి ఇబ్రహీపట్నం– చౌటుప్పల్ ఆర్టీసీ బస్సు రావడంతో శనివారం మండల పరిధి తిప్పాయిగూడ ప్రజలు పూజలు చేశారు. బస్సు పునరుద్ధరణకు కృషి చేసిన సీఐ మధును సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో నల్లగొండ, యాదాద్రి(భువనగిరి) జిల్లాల పరిధి గ్రామాలకు చౌటుప్పల్ బస్సు ఎంతో కీలకమైందని తెలిపారు. మూడు జిల్లాల ప్రాంతాల ప్రజల రాక పోకలకు ఈ సర్వీసు చాల ఉపయోగకరమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోరవీరేష్ గౌడ్, యాదయ్య, కొమురయ్య, చంద్రయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిదారుల సర్వే



సర్వే చేస్తున్న జీపీ కార్యదర్శి రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు సంక్షేమ పథకాల లబ్ధిదారుల పరిశీలన కోసం చెక్ లిస్ట్ సర్వేను ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో చేపట్టారు. ఇటీవల నిర్వహించిన అధికారుల సమావేశంలో ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మంది లబ్ధిపొందుతున్నారు, రాని వారుంటే ఏ కారణం చేతో రావడం లేదో తెలిసేందుకు సర్వే చేయాలని, ఇది ఫిబ్రవరి 10వ తేదీ లోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సర్వే అర్హులైన వారికి లబ్ధిచేకూర్చేందుకు తోడ్పాటు అవుతుందని ఎమ్మెల్యే భావించారు. దీంతో మున్సిపల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ సిబ్బందితో శనివారం సర్వేను మొదలు పెట్టారు. ముకునూర్ గ్రామంలో జీపీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

- వాహనదారుల ఇబ్బంది
- రద్దీతో ట్రాఫిక్ జాం
- పట్టించుకోని అధికారులు

తుర్కయంజాల్: రహదారికి ఇరువైపులా చిరువ్యాపారులు ఏర్పాటు చేస్తున్న దుకాణాలు, తోపుడు బండ్లతో వాహనదారులు, బాటసారుల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్కడ తొలగిస్తే.. ఇక్కడికి

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పురపాలక సంఘం పరిధి సాగర్ రహదారిని ఆనుకొని చిరు వ్యాపారులు ఇష్టానుసారంగా దుకాణాలను ఏర్పాటు చేస్తూ.. వాహనదారులకు ఇబ్బందిగా మారారు. అయినప్పటికీ.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంజాపూర్ కూడలి నుంచి గుర్రంగూడ వరకు ప్రమాదకర రీతిలో మలుపుల వద్ద దుకాణాలు కొనసాగిస్తున్నారు. గతంలో సాగర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న పండ్ల షాపులను జీహెచ్ఎంసీ, పోలీసులు తొలగించడంతో రూటు మార్చి పురపాలక సంఘం పరిధి సాగర్ రహదారిపై ఏర్పాటు చేశారు.

చెరువు కట్టపై..

మాసబ్ చెరువు కట్టపైన చిరువ్యాపారులు పదుల సంఖ్యలో తోపుడు బండ్లు, చిరు దుకాణాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ప్రతి రోజు సాయంత్రం సమయంతో పాటు శని, ఆదివారాల్లో కట్టపైన ఉన్న పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయాల్లో దుకాణాలతో పాటు, వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రద్దీ వేళలో ట్రాఫిక్‌ను నియంత్రించడం, వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు.



సాగర్ రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన దుకాణాలు

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి..

బొంగుళూరు గేటు ఔటర్ రింగు రోడ్డు జంక్షన్ నుంచి మొదలుకుని మన్నెగూడ కూడలి వరకు మధ్యాహ్న సమయాల్లో రోడ్డుకు ఆనుకుని హోటళ్లు, పండ్ల దుకాణాలను ఏర్పాటు చేయడంతో వాహనచోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇలాగే కొనసాగితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే వీటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తొలగిస్తాం



సాగర్ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను ఏర్పాటు చేయొద్దని పలు మార్లు నిర్వాహకులను హెచ్చరించాము. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించాము. అయినా వారిలో మార్పు రావడం లేదు. వాటిని తొలగింపచేస్తాం.

– అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

లయన్స్‌క్లబ్ సేవలకు గుర్తింపు

- ప్రపంచంలో 43వ క్లబ్‌గా ఆమనగల్లు
- లయన్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: నిరంతరం ప్రజాసేవలో తరిస్తున్న లయన్స్‌క్లబ్‌కు అరుదైన గుర్తింపు లభించిందని లయన్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ పరిధిలో 43వ పెద్ద క్లబ్‌గా, దేశంలో 31వ క్లబ్‌గా, తెలంగాణలో ఆమనగల్లు క్లబ్‌కు మొదటి గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు. పట్టణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ హాలులో ఈ నెల 15న నిర్వహించే క్లబ్ రీజియన్ కాన్ఫరెన్స్ కరపత్రాలను క్లబ్ ఎల్‌సీఎఫ్ ఏరియా లీడర్ నరేందర్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ డాక్టర్ శ్రీనులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్‌కు రీజియన్ పరిధి 11 క్లబ్‌ల సభ్యులు హాజరు కావాలని కోరారు. క్లబ్ 320ఏ జిల్లా పరిధిలోని క్లబ్‌లలో ఆమనగల్లు క్లబ్‌లో 230 సభ్యులు ఉన్నారని ఆయన వెల్లడించారు.

గర్వకారణం

లయన్స్‌క్లబ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కంటి ఆస్పత్రి, కడ్తాలలోని నేత్ర చికిత్సాలయం, కల్వకుర్తిలో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను నిర్వహిస్తూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. మీల్స్ ఆన్ మీల్స్ పేరుతో అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఈ సేవలకు గుర్తింపుగా లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా ఆమనగల్లుకు మొదటి గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్‌ఓ పాష, జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ మురళీదర్, డాక్టర్ కృష్ణ, జిల్లా చైర్మన్లు అంజయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి తదితరులు

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్



విద్యాకమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రానికి మంజూరైన మహాత్మా జ్యోతిరావ్‌పూలే బీసీ గురుకుల పాఠశాలను కడ్తాల్‌లోనే ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారంలో నిర్వహిస్తున్న పాఠశాలను కడ్తాల్‌కు తరలించాలని కోరారు. ఈ మేరకు శనివారం నగరంలోని విద్యాకమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు విశ్వేశ్వరయ్య, చారకొండ వెంకటేశ్‌లకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధాని సమీపంలోని కడ్తాల్‌కు 2019లో గురుకుల పాఠశాల మంజూరు కాగా, సరైన భవనం లేదని పేర్కొంటూ.. నాటి నుంచి యాచారంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో ఇక్కడి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. కడ్తాల్ నుంచి విద్యార్థులు యాచారం వెళ్లి రావాలంటే ఇబ్బంది పడుతున్నారని, వెంటనే కడ్తాల్‌లో నూతన భవనం నిర్మించి పాఠశాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ మహాసభ వ్యవస్థాపకుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, నాయకులు నరేశ్ ముదిరాజ్ ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్

మొయినాబాద్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు, మొయినాబాద్, పెద్దమంగళారం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న కార్యాలయాల్లో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మురుగు కాల్వలు, చెత్తాచెదారం ఎప్పటికప్పుడూ శుభ్రం చేయించాలని సూచించారు. ఆయన వెంట అధికారులు వెంకటేశ్, సుదర్శన్, సిబ్బంది రాజేశ్ ఉన్నారు.

హిమాయత్‌నగర్‌లో..

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామాన్ని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంధ్యారాణి, సుహాసిని, అజీజ్‌నగర్ పంచాయతీ కారోబార్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



చిలుకూరులో అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నక్షబాట కబ్జాపై చర్యలు తీసుకోండి

కేశంపేట: కేశంపేట మండలం అల్వాల గ్రామ పరిధిలోని నక్షబాటను కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం రైతులు తహసీల్దారు అజం అలీకి ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 191, 194, 159లో 30 ఎకరాల భూమికి ఆనుకొని ఉన్న నక్షబాటను అల్వాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని, కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్గీకరణే 'లక్ష డప్పుల' లక్ష్యం



యాచారం: డప్పులతో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

- మహాసభకు మాదిగలు తరలిరావాలి
- ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు
- గ్రామాల్లో డప్పులతో ప్రచారం
- వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణే 'వేయి గొంతులు.. లక్ష డప్పుల' లక్ష్యమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సమితి దశాబ్దాల పోరాట ఫలితంగా వర్గీకరణ తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో.. మాలలు స్వార్థపూరితంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ, మాదిగలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 7న నగరంలో సభ వాల్ పోస్టర్‌ను సమితి జిల్లా నాయకులు మల్లెపోగు మల్లేశ్, పులికంటి మైసయ్య, మండల అధ్యక్షుడు శ్రీశైలంలు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మహాసభ జరగనుందని, మాదిగలు డప్పులతో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమతి నాయకులు సాయిలు, విజేందర్, జంగయ్య, పుల్లయ్య, అల్లాజీ, అరుణ్, రాము, రమేశ్, శంకర్, సుదర్శన్, పర్వతాలు, శ్రీరాములు, శ్రీశైలం, అశోక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తరలిపోదాం..

యాచారం: ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణే లక్ష్యంగా ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు.. లక్ష డప్పుల సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సమితి ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. వర్గీకరణ పోరాటానికి లక్షలాది మంది తరలిపోదామన్నారు. యాచారం గ్రామానికి చెందిన ముదిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మారోజ్ శ్రీనువాస్‌లు 32 డప్పుల కొనుగోలు కోసం డబ్బులు అందజేశారు. కార్యక్రమంలో సమితి మండల అధ్యక్షుడు మహేశ్, నాయకులు శ్రీను, మహెందర్, యాదయ్య, జోగు అంజయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతిమపోరాటం

ఇబ్రహీంపట్నం రూరల్: నగరంలో నిర్వహించబోయే వేల గొంతులు.. లక్ష డప్పుల సభను జయప్రదం చేయాలని మాదిగ రంగారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ బోసుపల్లి ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు సాధించలేమని, అంతిమ పోరాటానికి మాదిగ, మాదిగ ఉప కూలాలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపగళ్ల కృపాకర్, శ్రీహరి, ప్రవీణ్, శ్రీనివాస్, మహేందర్, రంజిత్, వెంకటేశ్, ప్రశాంత్, ప్రేమ్, రుదీర్, బీజేపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



డప్పులతో ప్రచారం చేస్తున్న జేఏసీ నాయకులు

ఘనంగా మార్కండేయ జయంతి

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో శనివారం మార్కండేయస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. పూజారి శివకుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, పుష్పార్చన, రుద్రాభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి డోలారోహణం, అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, కార్యదర్శి శివలింగం, కోశాధికారి సత్యరాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తామని ఆ పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు గౌని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్‌రెడ్డి అని, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకొని ఉన్నారని, పార్టీ శ్రేణులకు నిరంతరం అండగా నిలిచారని పేర్కొన్నారు. గతంలో రెండు పర్యాయాలు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచింది రంగారెడ్డి మాత్రమేనని చెప్పారు. ఆయనకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లు ఆ దిశగా ఆలోచించాలని, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినక ముందే నిర్ణయం తీసుకోవాలన్నారు.

పెద్దమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



కమిషనర్‌ను సన్మానిస్తున్న విఠల్ బాబా

మహేశ్వరం: ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ జాతరకు సంబంధించిన ఏర్పాట్లను కమిషనర్ బి.వెంకట్రామ్ శనివారం పరిశీలించారు. జాతర కోసం మున్సిపల్ తరఫున మంజూరు చేసిన రూ.3లక్షలతో చేపట్టాల్సిన సదుపాయాలపై ఆయన ధర్మకర్త కరన్ కోట్ విఠల్‌బాబాతో కలిసి చర్చించారు. ఆలయానికి వచ్చే రూట్‌లోని మట్టి రోడ్డుకు మరమ్మతులు, విద్యుత్, నీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలలో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ముఖ్యంగా ఆదివారం బోనాల సమర్పణ, సోమవారం జరగనున్న కల్యాణానికి భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో పారిశుద్ధ్య సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతామన్నారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కమిషనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, సూపర్‌వైజర్ బుడుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఫిర్యాదు

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు సంతోష్, సుమిత్, శ్రీనివాస్ మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీరాం కాలనీపై బస్టాప్ నుంచి దిగువన ఎర్రకుంట వరకు రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ కారణంగా ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

కొంచెం మోదం.. కొంచెం ఖేదం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పద్దు ఏ మాత్రం ఆమోద యోగ్యంగా లేదని ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొనగా.. కేంద్రం తెచ్చిన ప్రతి సంస్కరణలో తెలంగాణకు భాగస్వామ్యం ఉంటుందని బీజేపీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. ఈ పద్దు కొందరికే ప్రయోజకరంగా ఉంది. పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఊరట కలిగించే అంశమే. కానీ.. ఆపై వార్షిక ఆదాయం దాటిన వారికి సుమారు ఒక నెల జీతం పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తుందని ఉద్యోగులు వివరించారు. ప్రస్తుత బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వారి మాటల్లోనే..

– ఇబ్రహీంపట్నం రూరల్/ మంచాల

- ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే 'పొద్దు' పొడుపు
- తెలంగాణకు ఒరిగిందేం లేదు
- 2025–26 కేంద్ర బడ్జెట్‌పై నేతల అభిప్రాయాలు

ఎన్నికలున్న రాష్ట్రాలకే వరాలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025– 26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్.. తన రాజకీయ అవసరాలకే ఉపయోగించుకుంది.. తప్పా.. దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. బీజేపీ పదే పదే వల్లెవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి వైఖరితో సాధ్యమవుతుందా?. ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం తగదు. ఎన్నికలు ఉన్న ప్రాంతాలకు వరాల జల్లు కురిపించింది. తెలంగాణ ప్రయోజనాలు కేంద్రానికి అవసరం లేదు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉండి ఏం సాధించినట్లు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పోయి సాధించింది ఏమి లేదు.

– మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

పన్నుల రాజ్యంగా మార్చారు



దేశాన్ని ఉద్ధరిస్తామన్న బీజేపీని చూస్తే నవ్వొస్తుంది. సంక్షేమ రాజ్యంగా ఉన్న దేశాన్ని పన్నుల రాజ్యంగా మార్చింది. ఆదాయపు పన్ను కట్టే రెండు మూడు కోట్ల మందికి సంబంధించిన అంశాన్ని తెరపైకి తెచ్చి, పన్ను మినహాయింపుతో గొప్ప మార్పులు తీసుకొస్తామనడం సిగ్గుచేటు. కనీసం చమురు ధరలు తగ్గించలేని స్థితిలో కేంద్రం ఉంది. దేశ జనాభాలో 145 కోట్ల మందిని టాక్స్ పరిధిలోకి తెచ్చి, లక్షల కోట్ల రూపాయలను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోంది. 2025లో అతిపెద్ద ఆర్థిక మాంద్యం సంవత్సరంగా సోషల్ సైటిస్టులు చెప్తుంటే ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు లేకపోవడం సిగ్గు చేటు.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

కొందరికి మాత్రమే..



కేంద్ర మంత్రి నిర్మల ప్రకటించిన బడ్జెట్ కొందరికి మాత్రమే ప్రయోజకరంగా ఉంది. కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు మంచిదే. కానీ.. ఆపై వార్షికాదాయం దాటిన వారికి ఒక నెల జీతం పన్ను రూపంలో చెల్లించాలి. రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా డిజిటల్ లెర్నింగ్ వనరుల యాక్సెస్ కోసం 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నెలకొల్పే నిర్ణయం హర్షణీయం. ఇవి విద్యార్థుల్లో ఆసక్తి, సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంచుతాయి.

– ఏ.వీ.సుధాకర్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి, ఎస్టీ యూటీఎస్

అర్బన్ ప్రాంతాల అభివృద్ధి



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణలోని అర్బన్ ప్రాంతాల అభివృద్ధికి రూ.1.50 లక్ష కోట్లు రాబోయే ఐదు సంవత్సరాల్లో రాబోతున్నాయి. అమృత్ పథకం ద్వారా 125 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు లబ్ధి చేకూరుతుంది. మధ్య తరగతి ప్రజలకు బడ్జెట్ అంకితం. తెలంగాణలో పది లక్షలకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. స్టార్టప్ కంపెనీలకు లబ్ధి చేకూరుతుంది. కేంద్ర ప్రభుత్వం ఏ సంస్కరణలు తెచ్చినా, తెలంగాణకు భాగస్వామ్యం ఉంటుంది.

– బోసుపల్లి ప్రతాప్, బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు